సాక్షి పెద్దపల్లి

శనివారం ౹ 22 ౹ మార్చి ౹ 2025

హుషారెత్తించిన 'యువ ఉత్సవ్'

రామగిరి(మంథని): సెంటినరీకాలనీలోని మంథని జేఎన్టీయూలో శుక్రవారం యువ ఉత్సవం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ, నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఉర్రూతలూగించాయి. అంతకుముందు సింగరేణి రెస్క్యూ జీఎం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ, యువత లక్ష్య సాధనకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో శైలజారాణి, జిల్లా యువజన అధికారి వెంకట్ రాంబాబు, వర్క్‌షాపు ఏజీఎం ఎర్రన్న, ప్రిన్సిపాల్ విష్ణువర్ధన్ తదితరులు పాల్గొన్నారు.





	ఇఫ్తార్ శనివారం (సా॥)	సహర్ ఆదివారం (ఉ॥)
కరీంనగర్	6.29	4.59
పెద్దపల్లి	6.32	4.58
సిరిసిల్ల	6.28	5.07
జగిత్యాల	6.31	5.01

న్యూస్‌రీల్

మారుపేర్ల పరిష్కారానికి ముఖ్యమంత్రి సానుకూలం



సీఎంతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్

గోదావరిఖని: సింగరేణి కార్మికుల మారుపేర్ల సమస్య పరిష్కారానికి ముఖ్యమంత్రి సానుకూలంగా ఉన్నారని రామగుండం ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాకూర్ అన్నారు. శుక్రవారం అసెంబ్లీ ప్రాంగణంలో సీఎం వద్ద ఎమ్మెల్యే పలు సమస్యలు ప్రస్తావించగా సానుకూలంగా స్పందించినట్లు వెల్లడించారు. నియోజకవర్గ సమస్యలు, ప్రజా సంక్షేమ కార్యక్రమాలు తదితర అంశాలను సీఎం వద్ద ప్రస్తావించారు. సింగరేణి కార్మికుల సమస్యలు, మారుపేర్ల అంశం, కార్మికుల విజిలెన్స్ పెండింగ్ కేసుల గురించి వివరించారు. పారిశ్రామికాభివృద్ధి, పట్టణప్రగతి, రోడ్లు, డ్రైనేజీ, గృహ నిర్మాణం, విద్య, ఆరోగ్య సేవల విస్తరణ వంటి ముఖ్యాంశాలను అసెంబ్లీలో ప్రస్తావించనున్నట్లు వివరించారు. నియోజకవర్గంలో పేరుకుపోయిన సమస్యలను పరిష్కరించే దిశగా ముందుకు సాగుతున్నామని ఎమ్మెల్యే అన్నారు.

లంచం అడిగితే సమాచారమివ్వండి



ప్రభుత్వ ఆస్పత్రిలో అంటించిన పోస్టర్

పెద్దపల్లిరూరల్: 'జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిలో అన్నిసేవలను ఉచితంగా అందిస్తున్నాం.. లంచం ఇవ్వడం, తీసుకోవడం నేరం.. ఎవరైనా డబ్బులు అడిగితే సూపరింటెండెంట్ సెల్ నంబరు 84990 61999కు లేదా రీజినల్ మెడికల్ ఆఫీసర్ సెల్ నంబరు 94948 53906కు ఫోన్‌చేసి సమాచారం ఇవ్వాలి' అని ఆస్పత్రి ఆవరణలో పోస్టర్లు అంటించారు.

నేతల త్యాగఫలమే వర్గీకరణ



క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

కాల్వశ్రీరాంపూర్(పెద్దపల్లి): ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ రాజీలేని పోరాటం, అనేకమంది త్యాగాల ఫలితమే ఎస్సీ వర్గీకరణ బిల్లుకు చట్టసభలో ఆమోదం లభించిందని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు అంబాల రాజేందర్ అన్నారు. ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ బిల్లును అసెంబ్లీలో ఆమోదించడంపై మండల కేంద్రంలో శుక్రవారం బాణసంచా కాల్చి, మిఠాయిలు పంపిణీ చేశారు. రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. మందకృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. మూడు దశాబ్దాల కల సాకారమైందని నాయకులు అన్నారు. నాయకులు వంగళ తిరుపతిరెడ్డి, గంట రాములు యాదవ్, తులా మనోహర్‌రావు, బండ రవీందర్‌రెడ్డి, సబ్బని రాజమల్లు, దంతెనపెల్లి చిన్నస్వామి, దంతెనపెల్లి ధర్మయ్య, అక్కపాక తిరుపతి, ఉమామహేశ్వర్, తూండ్ల రాజయ్య, బర్ల తిరుపతి, మంతెన రామస్వామి, చలిగంటి స్వరూప, రాజేశం, శంకర్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించాలి



భూమిపూజ చేస్తున్న అధికారులు

రామగిరి(మంథని): లద్నాపూర్ నిర్వాసితులకు పన్నూర్, రత్నాపూర్‌లో కేటాయించిన పునరావాస కేంద్రంలో మౌలిక వసతులు కల్పించాలని అదనపు కలెక్టర్ దాసరి వేణు సింగరేణి అధికారులను ఆదేశించారు. పునరావాస కేంద్రంలో రూ.2.66 కోట్ల వ్యయంతో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు ఆర్జీ–3 జీఎం సుధాకర్‌రావుతో కలిసి శుక్రవారం ఆయన భూమిపూజ చేశారు. పునరావాస కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, రెండు అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రాథమిక పాఠశాల, కమ్యూనిటీ హాల్, రామాలయం, రెండు వినాయక మండపాలకు భూమిపూజ చేసి పనులు త్వరితగతిన పూర్తిచేయాలని వేణు అన్నారు. పలు అభివృద్ధి పనులను పరిశీలించిన ఆయన.. ఇతర సౌకర్యాలు కల్పించడానికి తగిన చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో మంథని ఆర్డీవో సురేశ్, తహసీల్దార్ సుమన్, ఎంపీడీవో శైలజారాణి, సింగరేణి అధికారులు రఘుపతి, ఐలయ్య, రాజేంద్రకుమార్, సుదర్శనం, శ్రీనివాస్, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

ఆశలు.. నీళ్లపాలు

- అన్నదాతకు వడగళ్ల కడగండ్లు
- దెబ్బతిన్న వరి, మొక్కజొన్న పంటలు
- ధ్వంసమైన కూరగాయల తోటలు
- రాలిపోయిన మామిడికాయలు
- లోతట్టు ప్రాంతాలు జలమయం
- జిల్లా కేంద్రంలో రాకపోకలకు తీవ్ర అంతరాయం
- పెద్దపల్లిలో అత్యధికంగా 32.8 మి.మీ. వర్షపాతం నమోదు



నేలవాలిన మొక్కజొన్న పంట



నిట్టూరులో కురుస్తున్న రాళ్లవాన



రాంపల్లిలో నేలవాలిన మొక్కజొన్నను పరిశీలిస్తున్న ఏవో అలివేణి, అధికారులు

పెద్దపల్లిరూరల్: అన్నదాతల ఆశలను అకాల వర్షం నీటిపాలు చేసింది. చేతికందే దశలో ఉన్న వరి, మొక్కజొన్న పంటలను తీవ్రంగా దెబ్బతీసింది. కూరగాయాల తోటలకూ తీరని నష్టమే జరిగింది. మామిడిపూత, కాత కూడా నేలరాసింది. శుక్రవారం సాయంత్రం ఒక్కసారిగా గాలిదుమారంతో కూడిన వడగళ్లు కురవడంతో రైతులు ఆందోళనకు గురయ్యారు. పెద్దపల్లి, ధర్మారం, జూలపల్లిలో వర్షం అధికంగా కురిసింది. మిగతా ప్రాంతాల్లో మోస్తరు వర్షం కురిసినట్లు అధికారులు తెలిపారు. వరి ఇప్పుడిప్పుడే గింజ దశకు చేరుకుంటోంది. దీనికి పెద్దగా నష్టం ఉండకపోవచ్చని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. మొక్కజొన్నకు కొంత నష్టం జరగొచ్చని వారు వివరించారు. అధికారులు ఇలా పేర్కొంటుంటే.. తమకు కనీసం పెట్టుబడి కూడా వచ్చేట్టులేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాంటున్నారు.

వివిధ గ్రామాల్లో..

పెద్దపల్లి పట్టంలో రాత్రి 8గంటల వరకు అత్యధికంగా 32.8మి.మీ. వర్షపాతం నమోదైంది. జిల్లాలోని దాదాపు అన్ని ప్రాంతాల్లో ఓ మోస్తరు వర్షం కురిసింది. ధర్మారం మండలంలో 29మి.మీ., జూలపల్లి మండలంలో 26మి.మీ. వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. పెద్దపల్లి మండలం నిట్టూరు, నిమ్మనపల్లి, హన్మంతునిపేట, రాంపల్లి, భోజన్నపేట గ్రామాల్లో రాళ్లవాన కురిసింది. రాంపల్లిలో నేలవాలిన మొక్కజొన్న పంటను మండల వ్యవసాయాధికారి అలివేణి క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

లోతట్టు ప్రాంతాలు జలమయం..

జిల్లాకేంద్రంలోని పలు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. సుభాష్ విగ్రహం వద్ద ఇప్పటికే డ్రైనేజీని మూసివేయగా.. మురుగునీరంతా రోడ్డుపైకి చేరుతోంది. వర్షానికి సైతం సుభాష్‌విగ్రహం ప్రాంతమంతా మోకాలిలోతులో నిలిచింది. మురుగునీరు రోడ్డుపైనే ప్రవహించింది. పోలీస్‌స్టేషన్ ఆవరణలోకి వర్షపునీరు వచ్చి చేరింది. బస్టాండ్, కమాన్ ప్రాంతాల్లోనూ ప్రధాన రోడ్లపై వర్షపు నీరు నిలిచి రాకపోకలకు తీవ్రఅంతరాయం కలిగింది.

విద్యుత్ తీగలపై పడ్డ ఫ్లెక్సీ

భారీగాలులతో కూడిన వర్షం ధాటికి జిల్లా కేంద్రంలోని ఓ భవనంపై ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ చిరిగి విద్యుత్ తీగలపై పడింది. దీంతో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం కలిగింది. ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాస్ ఆధ్వర్యంలో సిబ్బంది వెంటనే దానిని తొలగించి విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు.

మంథనిలో..

మంథని: అకాల వర్షంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. కానీ, వివిధ పంటలకు నష్టం కలిగిస్తోందని రైతులు ఆందోళన చెందుతున్నారు. మంథనిలో ఓ మోస్తరు వర్షం కురిసింది. వరి తదితర పంటలు దెబ్బతినే అవకాశం ఉందంటున్నారు.

సుల్తానాబాద్‌లో..

సుల్తానాబాద్(పెద్దపల్లి): మండల కేంద్రంతోపాటు సుగ్లాంపల్లి, పూసాల, ఆరేపల్లి తదితర గ్రామాల్లో భారీవర్షం కురిసింది. ఆయా గ్రామాల్లో మొక్కజొన్న కర్ర నేలవాలింది. పొట్టదశలోని వరి నీటిపాలైంది. వర్షంతో ఎలాంటి ప్రయోజనం లేదని, నష్టమే అధికంగా ఉందని రైతులు వాపోయారు.

ధూళికట్టలో..

ఎలిగేడు(పెద్దపల్లి): ఎలిగేడు మండలం ధూళికట్ట గ్రామంలో ఈదురుగాలులతో కూడి భారీవర్షం కురిసింది. దాదాపు అర్ధగంటపాటు వర్షం బీభత్సం సృష్టించింది. వడగళ్లు భారీగా కురిశాయి. మొక్కజొన్న కర్రలు నేలవాలాయి, పొట్ట, ఈనేదశలోని మొక్కజొన్న కర్రలు, వరి పైరు తీవ్రంగా దెబ్బతిన్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. మామిడికాయలు చెట్లపైనుంచి రాలి తీవ్రనష్టం కలిగించాయని అన్నారు. ఎలిగేడు, ముప్పిరితోట తదితర గ్రామాల్లో తుంపర వర్షం కురిసింది.

నేలవాలిన మొక్కజొన్న



కమాన్ ప్రాంతంలో విద్యుత్ తీగలపై పడ్డ ఫ్లెక్సీ

జూలపల్లి(పెద్దపల్లి): కోనరావుపేట, జూలపల్లి, వడ్కాపూర్, పెద్దాపూర్, అబ్బాపూర్, నాగుపల్లె, తెలుకుంట తదితర గ్రామాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వడగళ్ల వానకు వరి, మొక్కజొన్న పంటలకు తీవ్రనష్టం వాటిల్లింది. ఒక్కసారిగా వచ్చిన గాలివాన అతలాకుతలం చేసింది. ఆరుగాలం కష్టపడిన అన్నదాత శ్రమ మరో నెలరోజుల్లో చేతికి వస్తుందనగా అకాలవర్షం ఆగమాగం చేసింది.

పంటంతా పడిపోయింది



నాకున్న ముప్పయి గుంటల్లో మక్క ఏసిన. కంకులు పాలు పోసే దశ వచ్చినయి. అకాల వర్షం కర్రలను నెల పాలు చేసింది. మరో నెలరోజుల్లో చేతికొచ్చే పంట తీవ్రంగా దెబ్బతిన్నది. నలభై వేల రూపాయల వరకు నష్టం వాటిల్లింది.

– దాడి కుమార్, రైతు, కోనరావుపేట

ఊరూవాడా చెప్పుకోవాలి

- రైతు రుణమాఫీ, రైతుభరోసా లబ్ధిదారుల పేర్లు ప్రదర్శన
- గ్రామాల్లో ముఖ్య కూడళ్లలో ఫ్లెక్సీల ఏర్పాటుకు నిర్ణయం
- లబ్ధిదారుల వివరాలు, పేర్ల ముద్రణకు రంగం సిద్ధం
- జిల్లాలవారీగా టెండర్లు పిలిచిన వ్యవసాయశాఖ
- ఉగాది నాటికి ఏర్పాటు లక్ష్యంగా ప్రయత్నాలు



ఉమ్మడి జిల్లాలో రుణమాఫీ స్వరూపం

జిల్లా	రుణమాఫీ పొందిన రైతులు	మాఫీ అయిన మొత్తం రూ.కోట్లు
కరీంనగర్	70,348	536.55
జగిత్యాల	80,515	721.74
పెద్దపల్లి	51,827	379.52
రాజన్నసిరిసిల్ల	43,770	346.16

సాక్షిప్రతినిధి,కరీంనగర్:

చేసింది చెప్పుకోవాలి.. అని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. తాము అమలు చేస్తున్న ప్రజాసంక్షేమ పథకాలు, అందుకోసం ఖర్చు చేసిన నిధుల వివరాలను ప్రజలకు తెలియజెప్పాలని ప్రణాళికలు రచిస్తోంది. గత ప్రభుత్వం కన్నా అధిక మొత్తంలో ఏకకాలంలో రుణమాఫీ చేశామని, రైతు భరోసా అమలు చేశామని, ఈ విషయాలను గ్రామస్తులు చర్చించుకునే విధంగా చూడాలన్నది రాష్ట్ర ప్రభుత్వం ఆలోచనగా తెలుస్తోంది. అందుకోసం లబ్ధిదారుల పేర్లను గ్రామంలోని ముఖ్యవీధుల్లో ప్రదర్శించడం, తద్వారా తాము చేసిన పనులకు ఇంటింటికి తెలియజేయడం, ప్రజల మనసు గెలుచుకోవాలన్న తాపత్రయంతో వ్యవసాయశాఖ అడుగులు వేస్తోంది. కొంతకాలంగా ప్రభుత్వ ఉద్యోగం పొందిన పలువురు యువతకు నియామక పత్రాలు ప్రభుత్వ పెద్దలు స్వయంగా అందజేస్తున్న తరహాలోనే ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిసింది. వచ్చే స్థానిక సంస్థలు, గ్రామపంచాయతీ ఎన్నికల్లో వీలైనన్ని ఎక్కువ సీట్లు గెలుచుకునేందుకు ఈ ప్రచారాన్ని ముందుకు తెచ్చినట్లు సమాచారం.

ఏం చేస్తారు?

రైతు రుణమాఫీ, రైతు భరోసా కోసం ప్రభుత్వం రూ.కోట్లు విడుదల చేస్తోంది. అదే సమయంలో తాము అత్యధిక నిధులు విడుదల చేసి చరిత్ర సృష్టించామన్నది కాంగ్రెస్ వాదన. అదే సమయంలో రుణమాఫీ, రైతు భరోసా అమలు తీరుపై ప్రతిపక్షాలు దుమ్మెత్తిపోస్తున్నాయి. అందుకే, ప్రతిపక్షాల వాదనలను సమర్థంగా తిప్పికొట్టేందుకే ప్రభుత్వం తాము చేసిన పనులను ఊరూ, వాడా చెప్పుకునేలా ఈ ఆలోచనకు తెరతీసింది. ప్రతీ గ్రామంలో కనీసం మూడు ముఖ్యమైన కూడళ్ల వద్ద ఆ గ్రామంలో రైతు భరోసా, రైతు రుణమాఫీలో ఏ రైతుకు ఎంత లబ్ధి జరిగింది? ఆ రైతు పేరు, మాఫీ వివరాలు అంకెల్లో పేర్కొంటూ ఫ్లెక్సీ ఏర్పాటు చేయనున్నారు. వీటిని వీలైనంత మంది ఎక్కువగా ప్రజలు వీక్షించేలా జాగ్రత్తలు తీసుకోనున్నారు. ఈ మేరకు ఉగాదిలోగా టెండర్లు, ముద్రణ పూర్తి కావాలన్న లక్ష్యంతో కలెక్టర్లు, వ్యవసాయశాఖాధికారులు పనిచేస్తున్నారు. ఇప్పటికే అన్ని గ్రామాల రైతుల పూర్తి వివరాలు గణాంకాలతో సహా సిద్ధం చేశారు.

టెండర్లు పిలిచిన వ్యవసాయశాఖ

రాష్ట్రంలోని అన్నిజిల్లాల వ్యవసాయశాఖ అధికారులు రైతు రుణమాఫీ, రైతు భరోసా పథకాల్లో రైతుల పేర్ల ముద్రణకు ఫ్లెక్సీ టెండర్లు పిలిచారు. వాస్తవానికి ఈ టెండర్‌కు అనుకున్నంత ప్రచారం జరగలేదు. ఈ ప్రకటన ద్వారా వచ్చిన టెండర్లను ఖరారు చేసి త్వరలోనే అధికారికంగా ముద్రణకు ఆదేశాలివ్వనున్నారు. ఆరడుగుల పొడవు, మూడు అడుగుల వెడల్పుతో ఈ ఫ్లెక్సీలు ఉండనున్నాయి. ముఖ్యమంత్రి, వ్యవసాయశాఖ మంత్రి ఫొటోలు ఫ్లెక్సీలో ఉండనున్నాయి. ఈ ప్రక్రియ పూర్తి కాగానే, ముద్రణకు ఆర్డర్ ఇవ్వడం, ఫ్లెక్సీలను గ్రామాల్లో కూడళ్లలో ఏర్పాటు చేయడం చకచకా జరిగిపోనున్నాయి. ఉమ్మడి జిల్లాలో 2.46 లక్షల మంది రైతులకు మూడు నుంచి నాలుగు దశల్లో ఇటీవల రైతు రుణమాఫీ జరిగింది. వీరికి దాదాపు రూ.రెండువేల కోట్ల వరకు ప్రభుత్వం రుణమాఫీ చేసింది. ఈ నేపథ్యంలో ఎవరికి ఎంత మాఫీ అయిందన్న విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లనున్నారు.

'పది' పరీక్షలు ప్రారంభం





పెద్దపల్లిలోని ఓ పరీక్ష కేంద్రంలోకి వెళ్తున్న విద్యార్థులు, పరీక్ష రాస్తున్న విద్యార్థులు

- జిల్లాలో 99.87శాతం హాజరు

పెద్దపల్లిరూరల్: జిల్లాలో పదో తరగతి వార్షిక పరీక్షలు శుక్రవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. జిల్లాలోని 14 మండలాల్లో 41 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. మొత్తం 7,393 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా.. ఇందులో తొమ్మిది మంది గైర్హాజరయ్యారని విద్యాశాఖ అధికారులు తెలిపారు. ఫ్లయింగ్‌స్క్వాడ్స్‌తోపాటు ఉన్నతాధికారులు పరీక్ష కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు.

పరీక్ష కేంద్రం మార్పుతో పరేషాన్

మంథని: పదో తరగతి పరీక్ష కేంద్రం మార్పుతో విద్యార్థులకు అసౌకర్యం ఏర్పడింది. గతంలో స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, బాలుర ఉన్నత పాఠశాల, గురుకుల బాలుర విద్యాలయంలో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈసారి విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉండడంతో పట్టణ శివారులోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలోనే పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇవి పట్టణ శివారులో ఉండడంతో అక్కడకు వెళ్లేందుకు విద్యార్థులు అవస్థలు పడ్డారు. ఆర్టీసీ బస్టాండ్‌కు సమీపంలో ఉన్న బాలుర, జెడ్పీ బాలికల హైస్కూల్‌లో ఏర్పాటు చేయకుండా ఈసారి బాలుర జెడ్పీ హైస్కూల్‌లో పరీక్ష కేంద్రం ఏర్పాటు చేయడంతో విద్యార్థులు తికమకపడ్డారు. స్కూల్‌కు ఇరు వైపులా రోడ్డు ఉన్నా.. ఎటువైపు నుంచి వెళ్లాలో సూచిక బోర్డు కూడా ఏర్పాటు చేయలేదు. కనీస సౌకర్యాలు కల్పించలేదు.

దరఖాస్తుల ఆహ్వానం

పెద్దపల్లిరూరల్: చేనేత, టెక్స్‌టైల్స్ టెక్నాలజీ డిప్లొమా కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సంబంధిత అధికారి హిమజాకుమార్ తెలిపారు. మూడేళ్లపాటు ఆరు సెమిస్టర్లు ఉంటాయన్నారు. పదోతరగతి పాసై, 23 ఏళ్లలోపు వారు అర్హులన్నారు. ఆసక్తి, అర్హత గలవారు వచ్చేనెలలో హైదరాబాదులోని శ్రీపొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ కార్యాలయంలో దరఖాస్తు సమర్పించాలన్నారు. వివరాలకు 90300 79242లో సంప్రదించాలని ఆయన సూచించారు.

పదేళ్లలో ఒక్క రేషన్‌కార్డు ఇవ్వలేదు

- అసెంబ్లీలో పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయరమణారావు

సాక్షి, పెద్దపల్లి: పదేళ్లలో పెద్దపల్లి నియోజకవర్గంలో ఒక్క కొత్తరేషన్‌కార్డు కూడా ఇవ్వలేదని ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. ఎక్కడ ఉప ఎన్నికలు నిర్వహిస్తే అక్కడ కొత్త రేషన్ కార్డులు, కొత్త పథకాలు ప్రవేశపెట్టి ఎన్నికలపైనే దృష్టి సారించారని, ప్రజలకు న్యాయం చేయలేదన్నారు. శుక్రవారం ఆయన అసెంబ్లీలో ప్రసంగించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజాపాలన ద్వారా అర్హులైన వారినుంచి దరఖాస్తులు స్వీకరించామన్నారు. అర్హులైన ప్రతీఒక్కరికి కొత్తరేషన్ కార్డు ఇచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయించిందని ఎమ్మెల్యే తెలిపారు. త్వరలోనే రేషన్‌కార్డుదారులకు సన్నబియ్యం అందించనున్నామని విజయరమణారావు అన్నారు. గతంలో రేషన్ బియ్యం రీసైక్లింగ్ చేసిన చరిత్ర బీఆర్ఎస్ పార్టీదన్నారు. కాళేశ్వరం పేరిట ప్రజల సొమ్మును నీళ్లపాలు, రాళ్లపాలు చేసిందని ధ్వజమెత్తారు. ప్రతిపక్ష నేతలు అసెంబ్లీకి రారు, అభినందించరు, సలహా ఇవ్వరు.. కానీ సీఎం ఇట్లా, భట్టి విక్రమార్క అట్లా అని విమర్శలు చేస్తున్నారని ఆయన దుయ్యబట్టారు.

నాణ్యమైన వైద్యసేవలు అందించాలి

- కలెక్టర్ కోయ శ్రీహర్ష



కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లి రూరల్: ప్రభుత్వ ఆస్పత్రుల్లో నాణ్యమైన వైద్యసేవలు అందించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష సూచించారు. కలెక్టరేట్‌లో వైద్య, ఆరోగ్య శాఖ పనితీరుపై శుక్రవారం ఆయన సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ క్షయ శిబిరం, ఎన్‌సీడీ సర్వే చాలాబాగా చేశారని వైద్యసిబ్బందిని అభినందించారు. టీబీ రహిత గ్రామాలను ప్రకటించాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలో గుర్తించిన బీపీ, మధుమేహం బాధితులు తమ జీవన విధానంలో చేసుకోవాల్సిన మార్పుల గురించి ఏఎన్ఎం, ఆశ కార్యకర్తల ద్వారా ఏప్రిల్‌లో అవగాహన కల్పించాలని అన్నారు. డయాగ్నొస్టిక్ హబ్ ద్వారా వైద్య పరీక్షలు నిర్వహించి ఫలితాలు అందించడంలో జిల్లా ముందు వరుసలో ఉందని అన్నారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి అన్న ప్రసన్న కుమారి పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యల పరిష్కారానికి స్పెషల్ డ్రైవ్

జిల్లాలో ఈనెల 22 నుంచి ఏప్రిల్ 5వ తేదీ వరకు రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు. రెవెన్యూ సమస్యల పరిష్కారంపై అదనపు కలెక్టర్ వేణు, ఆర్డీవోలు, తహసీల్దార్లు, రెవెన్యూ అధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. ప్రభుత్వ భూముల పరిరక్షణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎల్ఆర్‌యూపీలో జరిగిన పొరపాట్ల సవరణకు అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. ప్రజావాణి ద్వారా అందే ఫిర్యాదులను పరిష్కరించాలని కలెక్టర్ తెలిపారు. భూ వివాదాలపై కోర్టు కేసుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. రెవెన్యూ డివిజన్ అధికారులు సురేశ్, గంగయ్య, కలెక్టరేట్ పరిపాలనాధికారి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ ప్రమాణాలతో రైల్వేస్టేషన్ అభివృద్ధి



పనులు పర్యవేక్షిస్తున్న జీఎం అరుణ్‌కుమార్ జైన్

రామగుండం: అంతర్జాతీయ ప్రమాణాలతో రామగుండం రైల్వేస్టేషన్‌ను ఎయిర్ పోర్ట్‌ను తలదన్నేలా ఆధునికీకరిస్తున్నామని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ అన్నారు. ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే ప్రధాన ఉద్దేశమన్నారు. రామగుండం రైల్వేస్టేషన్ పనులను శుక్రవారం పరిశీలించారు. అమృత్ భారత్ పథకంలో భాగంగా రూ.26.5 కోట్లతో రైల్వేస్టేషన్ ఆధునికీకరణ చేపట్టామని, ఈ పనులు తుదిదశకు చేరుకున్నాయని తెలిపారు. పది రోజుల్లోగా రైల్వేస్టేషన్‌ను ప్రారంభిస్తామని అన్నారు. రైల్వేస్టేషన్‌ను కలియ తిరిగిన అనంతరం ఆయన వివిధ శాఖల అధికారులతో సమావేశమై పలు అంశాలపై సమీక్షించారు.

రోడ్డుప్రమాదాల నియంత్రణే లక్ష్యం



మాట్లాడుతున్న పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా

- రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా

గోదావరిఖని: రోడ్డు ప్రమాదాల నియంత్రణే లక్ష్యంగా పనిచేయాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా ఆదేశించారు. శుక్రవారం పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల్లో రోడ్డుసేఫ్టీపై సమీక్షించారు. ఎన్‌హెచ్–63, ఎన్‌హెచ్–363, ఎస్‌హెచ్–1, ఎస్‌హెచ్–24, ఎస్‌హెచ్ –8 తదితర రోడ్లను గూగుల్ మ్యాప్ ద్వారా ఆయన పరిశీలించారు. 2022 నుంచి 2024 వరకు జరిగిన ప్రమాదాలు, మృతుల వివరాలు, ప్రమాదానికి గల కారణాలు, నియంత్రణకు తీసుకొన్న చర్యలపై విశ్లేషించారు. బ్లాక్‌స్పాట్ల వద్ద రేడియం స్టిక్కర్లతో కూడిన సూచికలు ఏర్పాటు చేయాలన్నారు. అవసరమైనచోట స్పీడ్ బ్రేకర్లు, సీసీ కెమెరాలు, లైట్లు, స్పీడ్ కెమెరాలు, జీబ్రా క్రాసింగ్ ఏర్పాటు చేయాలన్నారు. నేరాల నియంత్రణకు విజిబుల్ పోలీసింగ్ ముఖ్యమని సూచించారు. సమాచార వ్యవస్థను పటిష్టం చేసుకోవాలని అన్నారు. డ్యూటీ సమయంలో సిబ్బంది, అధికారులు స్వీయ రక్షణ పాటించాలని సీపీ సూచించారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



సదానందం (ఫైల్)

సైదాపూర్(హుస్నాబాద్): ప్రైవేట్ స్కూల్ బస్సు ఢీకొని మండలంలోని గొల్లగూడెంకు చెందిన మర్రి సదానందం (47) మృతిచెందాడు. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాలు.. హుజూరాబాద్‌కు చెందిన ప్రైవేట్ స్కూల్ బస్సు శుక్రవారం సైదాపూర్ వెళ్తుండగా బొత్తల్లపల్లి వద్ద మర్రి సదానందం ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ఈప్రమాదంలో సదానందం తీవ్రంగా గాయపడ్డాడు. బ్లూకోల్ట్స్ సిబ్బంది 108లో సదానందంను హుజూరాబాద్ ఆస్పత్రికి, మెరుగైన చికిత్స కోసం వరంగల్ ఎంజీఎంకు తరలించగా మార్గమధ్యలో మృతిచెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రైలు ఢీకొని వ్యక్తి దుర్మరణం

రామగుండం: రామగుండం–పెద్దంపేట రైల్వే స్టేషన్ల మధ్య గురువారం అర్ధరాత్రి దక్షిణ్ ఎక్స్‌ప్రెస్ ఢీకొనడంతో గుర్తు తెలియని వ్యక్తి దుర్మరణం చెందినట్లు జీఆర్పీ ఔట్‌పోస్టు ఇన్‌చార్జి గంగారపు తిరుపతి తెలిపారు. మృతుడి వయస్సు 35–40 మధ్య ఉంటుందన్నారు. నల్లటి జీన్స్ ప్యాంట్, బ్లూ కలర్ ఫుల్‌షర్టు ధరించి ఉన్నాడన్నారు. తలపగిలి నుజ్జునుజ్జు కావడంతో ముఖాన్ని గుర్తుపట్టలేని విధంగా ఉందని తెలిపారు. మృతదేహం వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదని, పోస్టుమార్టం నిమిత్తం గోదావరిఖని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి మార్చురీలో భద్రపరిచామని ఆయన పేర్కొన్నారు. సంబంధీకులు ఉంటే సెల్ నంబరు 99493 04574, 87126 58604లో సంప్రదించాలని ఆయన కోరారు.

ఎస్సారెస్పీ కాలువలో మృతదేహం లభ్యం



అరవింద్(ఫైల్)

హుజూరాబాద్: తుమ్మన్నపల్లి గ్రామంలోని ఎస్సారెస్పీ కాలువలో శుక్రవారం ఓ మృతదేహం లభ్యమైంది. పోలీసుల వివరాల ప్రకారం.. మంచిర్యాల జిల్లా జన్నారం మండలం చింతలపల్లి గ్రామానికి చెందిన వాసాల అరవింద్(21) కరీంనగర్ జిల్లా ఎస్సారార్ డిగ్రీ కళాశాలలో ఫైనలియర్ చదువుతున్నాడు. ఈనెల 19న స్నేహితులతో కలిసి ఎల్ఎండీలోని ఎస్సారెస్పీ కాలువ వద్దకు ఈత కోసం వెళ్లి గల్లంతైనట్లు ఎల్ఎండీ పోలీసులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

వృద్ధురాలు అదృశ్యం



లక్ష్మి(ఫైల్)

కొత్తపల్లి(కరీంనగర్): రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలం కోరెం గ్రామానికి చెందిన సావనపల్లి లక్ష్మి (70) బస్సులో కరీంనగర్‌కు ప్రయాణిస్తూ అదృశ్యం అయింది. నలుపు రంగు, గుండ్రని ముఖం కలిగి, ఎత్తు ఐదడుగులు ఉంటుంది. గులాబీ రంగు చీర, నీలం రంగు జాకెట్ ధరించి ఉంది. ఆమె కోసం బంధువులు, పోలీసులు ఆరా తీస్తూ గాలిస్తున్నారు. అయినప్పటికీ ఆచూకీ లభించడం లేదు. ఆమె కనిపిస్తే కొత్తపల్లి పోలీస్ స్టేషన్‌కు ఫోన్ నంబర్లు 9494490268/8712670765లకు సమాచారం అందించాలని, వారికి నగదు పారితోషికం ఇవ్వబడుతుందని ఎస్‌హెచ్‌వో, శిక్షణ ఐపీఎస్ వసుంధర యాదవ్ తెలిపారు.

మూత్రశాలలు శుభ్రంగా ఉన్నాయా?

- తలుపులు బిగించారా.. దుర్వాసన వస్తుందా?
- నేటి నుంచి క్యూసీఐ బృందం క్షేత్రస్థాయి తనిఖీలు
- రామగుండం బల్దియాకు చేరుకున్న ఢిల్లీ ప్రతినిధులు
- సెప్టిక్ ట్యాంకులు, టాయిలెట్ల నిర్వహణపై ఆరాకు సన్నద్ధం

కోల్‌సిటీ(రామగుండం): కేంద్ర పట్టణాభివృద్ధి సంస్థ, స్వచ్ఛ భారత్ మిషన్ ఆధ్వర్యంలో దేశంలోని పట్టణాలు, నగరాలు, మహానగరాల్లో పారిశుధ్యాన్ని మెరుగుపర్చడం కోసం ఏటా పోటీలు నిర్వహిస్తున్నారు. ఈసారి రెడ్యూస్–రియూజ్–రీసైకిల్(ఆర్ఆర్ఆర్) పేరిట 'స్వచ్ఛ సర్వేక్షణ్–2024' పోటీలు చేపట్టారు. ఇందులోనూ రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ బరిలో నిలిచింది. ఇప్పటికే స్వచ్ఛ సర్వేక్షణ్‌కు కీలకమైన ప్రజాభిప్రాయ(సిటిజన్ ఫీడ్‌బ్యాక్) సేకరణ చేపట్టింది. మరో కీలకమైన బహిరంగ మలవిసర్జన రహితం(ఓడీఎఫ్) పరిస్థితిని తనిఖీ చేయడానికి ఢిల్లీ నుంచి క్యాలిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా(క్యూసీఐ) ప్రతినిధులు శుక్రవారం రామగుండం చేరుకున్నార. శనివారం నుంచి బల్దియాలో ఓడీఎఫ్ స్థితిని నేరుగా తనిఖీ చేస్తారు.

ఓడీఎఫ్ – ప్లస్ ప్లస్ కోసం ఆశలు..

రామగుండం బల్దియాకు ప్రస్తుతం ఓడీఎఫ్ ప్లస్(బహిరంగ మలవిసర్జన రహితం) గుర్తింపు మాత్రమే ఉంది. 2023లో ఆ గుర్తింపు వచ్చింది. ఓడీఎఫ్–ప్లస్‌ప్లస్ గుర్తింపు కోసం ఇటీవల దరఖాస్తు చేసింది. అయితే, సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్(ఎస్‌టీపీ) పూర్తయినా వినియోగంలోకి రాలేదు. మల్కాపూర్‌లో వినియోగంలోకి వచ్చిన ఫీకల్ స్లడ్జ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ ఎఫ్ఎస్టీపీ) ద్వారా ఓడీఎఫ్ ప్లస్‌ప్లస్ గుర్తింపు వస్తుందని అధికారులు భావిస్తున్నారు.

ఓడీఎఫ్‌కు 1,200 మార్కులు..

ఈ ఏడాది స్వచ్ఛ సర్వేక్షణ్–2024 పోటీలో మొత్తం 12,500 మార్కులు కేటాయించారు. ఇందులో ఓడీఎఫ్‌కు 1,200, గార్బేజ్ ఫ్రీ సిటీ విభాగానికి 1,300, ఇతర విభాగాలకు 10,000 మార్కులు కేటాయించారు. క్యూసీఐ ప్రతినిధులు ఇచ్చే మార్కుల ఆధారంగా ఓడీఎఫ్‌పై రేటింగ్ రానుంది. జాతీయ స్థాయిలో ప్రకటించే ర్యాంక్‌లకూ ఓడీఎఫ్ మార్కులు కీలకం కానున్నాయి.



రామగుండం బల్దియాలోని ఎఫ్ఎస్‌టీపీ ప్లాంట్

నేటి నుంచి క్యూసీఐ బృందం పరిశీలన..

ఢిల్లీ నుంచి వచ్చిన క్వాలిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా(క్యూసీఐ)లో రంజిత్ పుత్ర, జీవన్ కిశోర్ నాయక్ ఉన్నారు. తొలిరోజున బల్దియా కార్యాయంలో ఓడీఎఫ్ డాక్యుమెంట్లు పరిశీలించారు. శనివారం నుంచి క్షేత్రస్థాయిలో పర్యటించనున్నారు. దీంతో పారిశుధ్య విభాగం అప్రమత్తమైంది.

బల్దియాలో 25 టాయిలెట్స్ పరిశీలన..

బల్దియాలో ఆరు పబ్లిక్, 19 కమ్యూనిటీ టాయిలెట్స్‌తోపాటు ఎఫ్ఎస్‌టీపీ ప్లాంట్ వినియోగంలో ఉన్నాయనిఅధికారులుస్వచ్ఛ సర్వేక్షణ్ ఆన్‌లైన్‌లో పొందుపరిచారు. వీటి ఆధారంగా క్యూసీఐ వాటిని క్షేత్రస్థాయిలోపరిశీలించి వివరాలు సేకరించనుంది.

క్యూసీఐ పరిశీలించే అంశాలు..

సెప్టిక్ ట్యాంక్‌ల నిర్వహణ, పబ్లిక్, కమ్యూనిటీ టాయిలెట్స్‌లో అందుబాటులో కేర్ టేకర్, రోస్టర్ పద్ధతిలో క్లీనింగ్, టాయిలెట్స్‌కు వచ్చే ప్రజల ఫీడ్‌బ్యాక్, మహిళలు, పురుషులు గుర్తించేలా టాయిలెట్స్ బోర్డులున్నాయా? లోపల లైటింగ్, వాష్‌బేసిన్, మిర్రర్, విడిగా యూరినల్స్, బాత్‌రూం తలుపులకు లోపలివైపు బోల్టులు, వాటర్ సరఫరా, దుర్వాసన రాకుండా ఒడోనిల్, వెంటిలేషన్, ఎగ్జాస్టింగ్, క్యూఆర్ కోడ్ తదితర సౌకర్యాలపై క్యూసీఐ తనిఖీ చేసి ఫొటోలు తీసుకోనుంది. అక్కడికక్కడే ఆన్‌లైన్‌లో వివరాలను నమోదు చేయనుంది.

స్వచ్ఛ సర్వేక్షణ్-2024 మార్కులు

కేటాయించినవి	12,500
గార్బేజ్ ఫ్రీ సిటీ విభాగం	1,300
ఓడీఎఫ్, ఓడీఎఫ్ ప్లస్‌ప్లస్, వాటర్ ప్లస్	1,200
ఇతర విభాగాలు	10,000

పారిశుధ్య విభాగం ప్రొఫైల్:

మొత్తం డివిజన్లు	50
విస్తీర్ణం(చ.కి.మీ.లలో)	93.87
జనాభా(2011 లెక్కల ప్రకారం)	2,29,644
గుర్తించిన మురికివాడలు	92

స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాంక్‌లు

సంవత్సరం	పోటీ పడుతున్న బల్దియాలు	రామగుండం ర్యాంక్
2017	434	191
2018	4203	194
2019	4237	192
2020	4242	211
2021	4320	92
2022	4354	136
2023	4416	175
2024	4900 (ప్రస్తుతం ర్యాంక్ సర్వే)	

నిరుద్యోగులకు వరం.. 'రాజీవ్ యువ వికాసం'

- ప్రారంభమైన దరఖాస్తుల స్వీకరణ
- ఏప్రిల్ 5 వరకు తుది గడువు

సుల్తానాబాద్(పెద్దపల్లి): నిరుద్యోగులకు స్వ యం ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో రాష్ట్రప్రభుత్వం రాజీవ్ యువ వికాసం పథకానికి జిల్లా లో అర్హులైన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది.

ఆన్‌లైన్‌లో దరఖాస్తులు..

ఆసక్తి, అర్హతగల యువత ఆన్‌లైన్‌లో నేరుగా దరఖాస్తు చేసుకునేందుకు వెసులుబాటు కల్పించారు. ఇందుకోసం https://tgobmmsnew.cgg.gov.in వెబ్‌సైట్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈనెల 17 నుంచి దరఖాస్తులు స్వీకరిస్తోంది. ఏప్రిల్ 5వ తేదీ వరకు గడువు విధించింది. మున్సిపల్ కార్పొరేషన్, మున్సిపాలిటీల్లో కమిషనర్లు, ప్రత్యేక అధికారులు, మండల స్థాయిలో ఎంపీడీవోలు అర్హులను ఎంపిక చేస్తారు.

రూ.3లక్షల వరకు రుణం

గ్రామాలు, పట్టణాల్లోని నిరుద్యోగులకు అందించే యూనిట్లను వేర్వేరుగా ఎంపిక చేయనున్నారు. ఎంపికైన వారికి రూ.లక్ష – రూ.3 లక్షల వరకు రుణం మంజూరు చేస్తారు. రూ.లక్ష రుణం తీసుకుంటే 80 శాతం రాయితీ వర్తింపజేస్తారు. రుణం తీసుకున్న వారు స్వయం ఉపాధి కోసం చిన్న తరహా పరిశ్రమలు ఏర్పాటు చేసుకునే వీలుంది.

అవసరమైన ధ్రువీకరణ పత్రాలు..

రాజీవ్ యువ వికాసం పథకం కోసం దరఖాస్తు చేసుకునేందుకు అవసరమైన అన్ని ధ్రువీకరణ పత్రాలు జతచేయాలి. ఇందులో ఆధార్, రేషన్ కార్డు, కులం, ఆదాయం, బ్యాంకు పాసు పుస్తకం, స్టడీ సర్టిఫికెట్, మొబైల్ నంబరుతోపాటు ఇటీవల తీసిన ఫొటోలతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాలి. హార్డ్‌కాపీలను ఆయా కార్యాలయాల్లో సమర్పించాలి.

ఇఫ్తార్‌కు ఏర్పాట్లు చేసి వెళ్తుండగా..

- రెండు బైక్‌లను ఢీకొన్న లారీ
- తండ్రీకొడుకులు మృతి
- మరో ఇద్దరికి తీవ్రగాయాలు



అజీమ్(ఫైల్)



రెహమాన్(ఫైల్)

శంకరపట్నం(మానకొండూర్): రంజాన్ మాసం సందర్భంగా శుక్రవారం సాయంత్రం నిర్వహించే ఇఫ్తార్ విందుకు తండ్రికొడుకులు ఏర్పాట్లు చేశారు. అంతలోనే జరిగిన రోడ్డుప్రమాదంలో అసులువు బాసారు. దీంతో ఆ కుటుంబంలో విషాదం నెలకొంది. శంకరపట్నం మండలం కేశవపట్నం గ్రామంలో ఘటన జరిగింది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని మక్త గ్రామానికి చెందిన తండ్రికొడుకులు షేక్ అజీమ్ (35), షేక్ రెహమాన్ (10) శుక్రవారం కేశవపట్నంలో ఇఫ్తార్ విందుకు ఏర్పాట్లు చేసి ఇంటికి బైక్‌పై వెళ్తున్నారు. అదే సమయంలో మండలంలోని మెట్‌పల్లి గ్రామానికి చెందిన మందాడి శ్రీనివాస్‌రెడ్డి, ఇజ్జిగిరి హరీశ్ కూడా కేశవపట్నం నుంచి బైక్‌పై వెళ్తుండగా వరంగల్ నుంచి కరీంనగర్ వస్తున్న లారీ కేశవపట్నం బ్రిడ్జి సమీపంలో ఇరువురి బైక్‌లను ఢీకొంది. ఈ ప్రమాదంలో అజీమ్, రెహమాన్ తీవ్రంగా గాయపడ్డారు. మందాడి శ్రీనివాస్‌రెడ్డికి తీవ్ర, హరీశ్‌కు స్వల్పగాయాలయ్యాయి. కేశవపట్నం ఎస్సై రవి, సిబ్బంది 108వాహనంలో క్షతగాత్రులను హుజూరాబాద్ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో అజీమ్, రెహమాన్‌ను పరీక్షించిన వైద్యులు మృతిచెందినట్లు నిర్ధారించారు. ప్రమాదానికి కారణమైన లారీ ఆగకుండా వెళ్లడంతో పోలీసులు, స్థానికులు వంకాయగూడెంలో పట్టుకున్నారు. ప్రమాద స్థలాన్ని ఏసీపీ శ్రీనివాస్‌జీ, హుజూరాబాద్ రూరల్ సీఐ వెంకటి పరిశీలించారు. సాయంత్రం వేళ ఇఫ్తార్ విందులో పాల్గొనాల్సిన తండ్రికొడుకుల దుర్మరణం స్థానికులను కలచివేసింది.



ఘటన స్థలంలో బైక్‌లు

ఆర్ఎఫ్‌సీఎల్ ఆదాయం రూ.500 కోట్లు!

- 50 శాతం యూరియా తెలంగాణ రాష్ట్రానికే

ఫెర్టిలైజర్‌సిటీ(రామగుండం): దేశీయంగా ఎరువుల ఉత్పత్తి లక్ష్యంగా కేంద్ర ఎరువులు, రసాయనాల మంత్రిత్వ శాఖ మూతబడిన, నష్టాల్లో ఉన్న ఎరువుల కర్మాగారాలను పునరుద్ధరించింది. ఈ నేపథ్యంలో 2015 సంవత్సరంలో ఎఫ్‌సీఐ కర్మాగారాన్ని రామగుండం ఫర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్ కర్మాగారంగా పేరు మార్చి పునరుద్ధరించారు. 22 మార్చి 2021న రామగుండం ఎరువుల కర్మాగారం యూరియా కిసాన్ బ్రాండ్ పేరిట వాణిజ్య ఉత్పత్తులను ప్రారంభించింది. ప్లాంట్ ఉత్పత్తి సామర్థ్యం రోజూ 3,850 మెట్రిక్ టన్నుల యూరియా, 2,200 మెట్రిక్ టన్నులు. 2022 నవంబర్ 12న భారత ప్రధాని నరేంద్రమోదీ ప్లాంటును జాతికి అంకితం చేశారు. ఆర్ఎఫ్‌సీఎల్ ఉత్పత్తి చేసిన యూరియాను భారత్ బ్రాండ్‌తో మార్కెట్ చేస్తున్నారు. రామగుండం ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్ కర్మాగారం 2023–24 ఆర్థిక సంవత్సరంలో రూ.4,941.60 కోట్ల వ్యాపారం చేసింది. ఈ ఆర్థిక సంవత్సరం(2024–25)లో రూ.440.96 కోట్ల ఆదాయం(లాభం) సమకూరింది. ఈ ఆర్థిక సంవత్సరంలో కేంద్ర ఎరువులు, రసాయనాల శాఖ 12.7 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా ఉత్పత్తి చేయాలని లక్ష్యాన్ని నిర్దేశించింది. ఈక్రమంలోనే ఈసారి రూ.500 కోట్ల ఆదాయాన్ని సమకూరుస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు.



ఆర్ఎఫ్‌సీఎల్ ప్లాంట్

తగ్గిన దిగుమతుల భారం..

దేశీయంగా ఎరువుల కొరత అధికంగా ఉండడంతో కేంద్రప్రభుత్వం దిగుమతి తగ్గించేందుకు దేశవ్యాప్తంగా మూతపడిన, నష్టాల్లో ఉన్న ఎరువుల కర్మాగారాలను పునరుద్ధరించింది. తెలంగాణ రాష్ట్రంలోని ఆర్ఎఫ్‌సీఎల్ (నాటి ఎఫ్‌సీఐ), గోరఖ్‌పూర్(ఉత్తరప్రదేశ్), సింద్రీ (జార్ఖండ్), తాల్చేర్(ఒడిశా) ఎరువుల కర్మాగారాలు పునరుద్ధరించిన వాటిలో ఉన్నాయి. ఇందులోని రామగుండం ఫెర్టిలైజర్స్ కెమికల్స్ లిమిటెడ్ కర్మాగారం ఎరువుల ఉత్పత్తిని 2021 మార్చి 22న, గోరఖ్‌పూర్ యూనిట్‌లో 2022 అక్టోబర్ 18న, సింద్రీ యూనిట్‌లో 2022 నవంబర్ 05న ఉత్పత్తి ప్రారంభించారు. తాల్చేర్ ప్లాంట్‌లో 2025 చివరి నాటికి యూరియా ఉత్పత్తి ప్రారంభమయ్యే అవకాశాలు ఉన్నాయి.

ఆర్ఎఫ్‌సీఎల్‌లో సల్ఫర్ కోటెడ్ యూరియా

రామగుండం ఎరువుల కర్మాగారంలో రూ.150 కోట్లతో సల్ఫర్ యూరియా ఉత్పత్తి చేసేందుకు కేంద్రప్రభుత్వం ఆమోదించింది. ప్రస్తుతం నీమ్ కోటెడ్ యూరియా ఉత్పత్తి చేస్తున్నారు. దేశీయంగా వంటనూనెల డిమాండ్ అధికంగా ఉండడంతో దాని కొరత తీర్చేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పామాయిల్ సాగుకు సబ్సిడీ కల్పించాయి. పామాయిల్ సాగుకు ఉపయోగకరంగా ఉండే సల్ఫర్ కోటెడ్ యూరియాను రామగుండం ఎరువుల కర్మాగారంలో ఉత్పత్తి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం రూ.150 కోట్లు కేటాయించింది.

7 రాష్ట్రాలకు ఆర్ఎఫ్‌సీఎల్ యూరియా

రామగుండం ఎరువుల కర్మాగారంలో ఉత్పత్తి చేసిన యూరియాలో 50శాతం తెలంగాణ రాష్ట్రానికి కేటాయించారు. దీంతోపాటు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు ఈ యూరియా సరఫరా చేస్తున్నారు.

రాములోరికి తలంబ్రాలు

- కోటి తలంబ్రాలు ఒలిచే కార్యక్రమానికి శ్రీకారం



తలంబ్రాలు అప్పగిస్తున్న మహిళలు(ఫైల్)



రాములోరి తలంబ్రాలు

జ్యోతినగర్(రామగుండం): కల్యాణం కోసం తలంబ్రాల తయారీకి సాధారణంగా మరపట్టిన బియ్యం వినియోగిస్తారు. కానీ, శ్రీసీతారాముల కల్యాణం కోసం గోటితో వొలిచిన తలంబ్రాలు వినియోగించడం ఆనవాయితీగా వస్తోంది. ఈక్రమంలోనే ఎన్టీపీసీ అన్నపూర్ణకాలనీలోని శ్రీసీతారామ సేవా సమితి సభ్యులు గోటితో వొలిచిన తలంబ్రాలను శ్రీసీతారామ కల్యాణం కోసం పంపించడం ఆనవాయితీగా వస్తోంది. ఈఏడాది కూడా భద్రాచలంలోని శ్రీసీతారామచంద్ర స్వామి సన్నిధిలో ఏప్రిల్ 6న శ్రీరామ నవమి నిర్వహించనున్నారు. స్వామివారి కల్యాణోత్సవం కోసం మహిళలు గోటితో వొలిచిన తలంబ్రాలను పంపించి భక్తిని చాటుకుంటున్నారు. గోటితో కోటి తలంబ్రాలను వొలిచే ఈ కార్యక్రమానికి సమితి అధ్యక్షురాలు గోలివాడ చంద్రకళ ఆధ్వర్యంలో శుక్రవారం శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో శ్రీసీతారామ సేవా సమితి సభ్యులు కంది సుజాత, కొండు రమాదేవి, జనగామ రాజేశ్వరి, ఆలయ కమిటీ సభ్యుడు చెప్యాల సత్యానారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

తాళం వేసిఉన్న ఇంట్లో చోరీ

జమ్మికుంట: జమ్మికుంట మండలం నాగంపేట గ్రామంలో తాళం వేసి ఉన్న ఇంట్లో దొంగలు చోరీకి పాల్పడ్డారు. పోలీసుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన దార రవి ఇంటికి తాళం వేసి తన భార్యతో కలిసి వ్యవసాయ పనులకు వెళ్లాడు. పనులు ముగించుకుని ఇంటికి వచ్చేసరికి తాళం పగులగొట్టి ఉంది. లోనికి వెళ్లి చూడగా.. బీరువాలోని అరతులం బంగారం, రూ.20వేల నగదు చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు దర్యాప్తు చేస్తున్నారు.


సందడిగా అల్ఫోర్స్ 'ఫ్లిక్కర్'



విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన

కొత్తపల్లి: వావిలాలపల్లిలోని అల్ఫోర్స్ మైదానంలో శుక్రవారం ×ఫ్లిక్కర్‌† పేరిట నిర్వహించిన భగత్‌నగర్ అల్ఫోర్స్ ఈటెక్నో స్కూల్ వార్షికోత్సవం సందడిగా సాగింది. వేడుకలను ఎస్సారార్ రిటైర్డ్ ప్రిన్సిపాల్ వి.మధుసూదన్‌రెడ్డితో కలిసి అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ నరేందర్‌రెడ్డి జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా నరేందర్ రెడ్డి మాట్లాడుతూ 35ఏళ్లుగా అల్ఫోర్స్ విద్యా సంస్థల ద్వారా రాష్ట్ర విద్యారంగానికి విశిష్ట సేవలు అందిస్తూ తలమానికంగా నిలుస్తున్నామని తెలిపారు. అల్ఫోర్స్ ఈటెక్నో పాఠశాల, కళాశాలలో విద్యనభ్యసించిన హర్షిత్‌రెడ్డి ఇటీవల గేట్–2025లో ఆల్‌ఇండియా 60వ ర్యాంకు సాధించడం హర్షించదగ్గ విషయమన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బిల్లుల కోసం మంత్రుల చుట్టూ ప్రదక్షిణలు



కరీంనగర్: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలన నిర్వహిస్తున్నదా లేక రాక్షస పాలన సాగిస్తున్నదా అని మాజీ సర్పంచుల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు లక్ష్మీరాజం ప్రశ్నించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో మాట్లాడుతూ అభివృద్ధి బిల్లుల విడుదలకు మోకాలడ్డుతున్న ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని తప్పుబడుతూ, ఆందోళనలకు సిద్ధమవుతున్నట్లు ప్రకటించారు. బిల్లుల కోసం మంత్రుల చుట్టూ తిరిగినా, నిరాశే మిగిలిందని విమర్శించారు. నాయకుల ఎదుట మా సమస్యలు చెప్పుకోవడం తప్పేనా అన్నారు. అభివృద్ధి కోసం ఎమ్మెల్యేలను కలవడం అనైతికమా అంటూ ప్రశ్నించారు. ప్రభుత్వం తక్షణమే పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని, లేదంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

వస్త్రోత్పత్తి ఆర్డర్లు సకాలంలో పూర్తి చేయాలి

- కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

సిరిసిల్ల: వస్త్రోత్పత్తిదారులు ప్రభుత్వం ఇచ్చిన ఆర్డర్లను గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా కోరారు. కలెక్టరేట్‌లో శుక్రవారం వస్త్రోత్పత్తిదారులతో సమావేశమయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ సమగ్ర శిక్ష అభియాన్, సంక్షేమశాఖల వస్త్రోత్పత్తి ఆర్డర్లను వెంటనే అందించాలన్నారు. ఇందిరా మహిళాశక్తి చీరల ఆర్డర్లను వేగంగా పూర్తి చేయాలన్నారు. చేనేత, జౌళిశాఖ ఏడీ రాఘవరావు, టెస్కో ప్రతినిధి శంకరయ్య, పాలిస్టర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆడెపు భాస్కర్, టెక్స్‌టైల్ పార్క్ అధ్యక్షుడు అన్నల్‌దాస్ అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

కారుణ్య నియామకాలు

సిరిసిల్ల మున్సిపాలిటీలో ప్రజారోగ్య విభాగంలో పనిచేస్తూ మరణించిన ఉద్యోగుల వారసులకు కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా కారుణ్య నియామకపత్రాలు అందించారు. ప్రజా ఆరోగ్య విభాగంలో పబ్లిక్ హెల్త్ వర్కర్‌గా పనిచేసే సిరిగిరి నర్సింహులు అనారోగ్యంతో 2020లో మరణించగా.. అతని కుమారుడు సిరిగిరి రాజుకు ఉద్యోగ నియామకపత్రం అందించారు. నగునూరి నాంపల్లి 2023 మరణించగా అతని భార్య నగునూరి లతకు నియామక పత్రం అందించారు. మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, కలెక్టరేట్ ఏవో రాంరెడ్డి పాల్గొన్నారు.



కలెక్టరేట్‌లో కారుణ్య నియామక పత్రాన్ని అందిస్తున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

అర్హులకు ఓటుహక్కు కల్పించాలి

జిల్లాలో 18 ఏళ్ల నిండిన వారికి ఓటుహక్కు కల్పించాలని కలెక్టర్ కోరారు. శుక్రవారం రాజకీయ పార్టీ నాయకులతో సమావేశమయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో ఓటర్ జాబితా సవరణ పకడ్బందీగా చేయాలన్నారు. ఎన్నికల సమయంలో కాకుండా ఓటర్ జాబితా సవరణపై రాజకీయ నాయకుల ప్రతినిధులు ఎప్పటికప్పుడు సమీక్ష చేసుకోవాలని సూచించారు. జిల్లాలో 2,30,157 మంది పురుషులు, 2,47,977 మంది మహిళా ఓటర్లు, 38 మంది థర్డ్ జెండర్ ఓటర్లు ఉన్నారని తెలిపారు. సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవోలు రాధాభాయి, రాజేశ్వర్, రాజకీయ పార్టీల ప్రతినిధులు నాగుల శ్రీనివాస్, సంపత్, రాజన్న, రమేశ్, రమణ, ఎన్నికల సిబ్బంది రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.

ఎక్లాస్‌పూర్ సందర్శన



తాగునీటి సమస్య వివరిస్తున్న గ్రామస్తులు

మంథని: ఎక్లాస్‌పూర్‌లో కొద్దిరోజులుగా తాగునీరు రావడం లేదని అధికారులు దృష్టికి తీసుకెళ్ల.. మిషన్ భగీరథ, గ్రిడ్ అధికారులు శుక్రవారం గ్రామానికి చేరుకున్నారు. తాము కనీసం స్నానం చేయడానికి నీరు లేదని, తినే అన్నంలో మట్టి పోస్తారా? మా పరిస్థితిని అర్థం చేసుకోరా? అని గ్రామస్తులు అధికారులకు ఏకరువు పెట్టారు. గ్రిడ్ ఈఈ పూర్ణచందర్, డీఈ కిరణ్, మిషన్ భగీరథ డీఈఈ రాజ్‌కుమార్‌తోపాటు పలువురు అధికారులు నేరుగా ఇళ్లకు వెళ్లి నీటి సరఫరాను పరిశీలించారు. వాల్వ్‌లో మట్టి, ఇసుక నింపడంతో సమస్య వచ్చిందని వాపోయారు. సమస్య పరిష్కారానికి చొరవ చూపుతామని, గ్రామస్తులు సహకరించాలని అధికారులు కోరారు.

నృసింహుని హుండీ ఆదాయం రూ.66.02 లక్షలు



హుండీ ఆదాయం లెక్కిస్తున్న వలంటీర్లు

ధర్మపురి: ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామికి రూ.66,02,628 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం ఆలయ ప్రాంగణంలో 30–12–2024 నుంచి 21–3–2025 వరకు మొత్తం 81 రోజుల హుండీ ఆదాయం లెక్కించారు. 59 గ్రాముల మిశ్రమ బంగారం, 8.400 కిలోల మిశ్రమ వెండి, 37 విదేశీనోట్లు సమకూరాయి. దేవాదాయశాఖ సహాయ కమిషనర్ సుప్రజ, చైర్మన్ జక్కు రవీందర్, ధర్మకర్తలు, స్వచ్ఛంద సేవకులు, సూపరింటెండెంట్ కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బేకరీల్లో తనిఖీలు

- పలు దుకాణాలకు రూ.20 వేల జరిమానా

సాక్షి ఎఫెక్ట్..

కోల్‌సిటీ(రామగుండం): రామగుండం నగరపాలక సంస్థలో నాసిరకం ఆహార పదార్థాలను తయారు చేసి విక్రయిస్తున్న బేకరీలు, స్వీట్‌హౌస్‌ల్లో శుక్రవారం బల్దియా అధికారులు ఆకస్మిక దాడులు చేశారు. తనిఖీలతో నగరంలోని పలు బేకరీ, స్వీట్‌హౌస్‌ల వ్యాపారులు హడలెత్తిపోయారు. ×తింటే బేజారే..† శీర్షికను శుక్రవారం ×సాక్షి† ప్రచురించిన కథనంతో నగరపాలక సంస్థ కమిషనర్ అరుణశ్రీ స్పందించారు. కమిషనర్ ఆదేశాల మేరకు డిప్యూటీ కమిషనర్ వెంకటస్వామి నేతృత్వంలో పారిశుధ్య విభాగం అధికారులు బేకరీలు, స్వీట్ షాపుల్లో ఆకస్మిక తనిఖీలు చేశారు. నాసిరకం ఆహార పదార్థాలు విక్రయిస్తున్న ఒక బేకరీ, మరొక స్వీట్ షాపు నుంచి రూ.20,000 జరిమానా వసూలు చేశారు. మరో బేకరీ నుంచి నిషేధిత ప్లాస్టిక్ సంచులను స్వాధీనం చేసుకున్నారు. తనిఖీల్లో శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాగభూషణం, ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ మధుకర్, ఎంఐఎస్ ఆపరేటర్ శ్రీకాంత్ పాల్గొన్నారు.



జరిమానా విధిస్తున్న అధికారులు

మతోన్మాద విధానాలను తిప్పికొట్టాలి

- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి

కరీంనగర్: దేశంలో మతోన్మాదాన్ని పెంచి పోషిస్తూ దక్షిణాది రాష్ట్రాలకు తీరని అన్యాయం చేయాలని కుట్రచేస్తున్న బీజేపీ ప్రభుత్వ విధానాలను తిప్పికొట్టేందుకు దేశ ప్రజలంతా సిద్ధం కావాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం కరీంనగర్‌లోని బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో పార్టీ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామితో కలిసి మాట్లాడారు. పార్లమెంటుస్థాయిలో జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాల పునర్విభజన చేయాలని జమిలి ఎన్నికలను తెరపైకి తీసుకువచ్చి దక్షిణాది రాష్ట్రాలకు తీరని అన్యాయం చేసేందుకు బీజేపీ కుట్ర పన్నుతోందన్నారు. కేంద్రంలో అధికారంలో కొనసాగుతున్న నరేంద్ర మోడీ అప్పుల దేశంగా మారుస్తున్నాడని, గతంలో రూ.80లక్షల కోట్ల అప్పు ఉంటే తాజాగా రూ.150 లక్షల కోట్ల అప్పుచేసి కార్పొరేటు వ్యవస్థలకు కొమ్ము కాస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసే దిశగా కొంత ప్రయత్నాలు జరుగుతున్నప్పటికీ ఇంకా అనేక హామీలను నిలబెట్టుకోవాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పొనగంటి కేదారి, జిల్లా కార్యవర్గ సభ్యుడు కొయ్యడ సృజన్ కుమార్, బోయిని అశోక్, అందెస్వామి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి

స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలి

రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు సిద్ధం కావాలని సీపీఐ అభ్యర్థులు సిద్ధం కావాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే వెంకటరెడ్డి అన్నారు. కరీంనగర్‌లోని బద్దం ఎల్లారెడ్డిభవన్‌లో శుక్రవారం కార్యవర్గసభ్యుడు బత్తుల బాబు అధ్యక్షతన జరిగిన సీపీఐ జిల్లా కార్యవర్గ, కౌన్సిల్ సమావేశంలో మాట్లాడారు. జిల్లాలో సీపీఐకి గణనీయమైన చరిత్ర ఉందని, నిత్యం ప్రజా సమస్యల పరిష్కారం కోసం పనిచేశారని, నేటికీ అనేక గ్రామాల్లో తాజా మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, ఉపసర్పంచులు, సభ్యులు ఉన్నారని అన్నారు. అదే ఒరవడిని కొనసాగించేందుకు సీపీఐ శ్రేణులు స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసి విజయం సాధించే దిశగా ముందుకు సాగాలని తెలిపారు.